ఓం హ్రీం శ్రీం

# శ్రీవాసవి కన్యకాదేవి పురాణము

## షష్ఠాధ్యాయము

సూతునిచే శౌనకాది మహామునులకు చెప్పబడిన పరాశక్తి విజయగాధలను సాలంకాయన ఋషి మణిగుప్తాది వైశ్యోత్తములకు సవిస్తారముగ తెలియజేసెను. అపుడా వైశ్యోత్తములు "ఓ గురవరేణ్యా! మీరు మహత్తరములైన విషయములను వినిపించితిరి. మేము ధన్యులమైతిమి. ఇపుడు మీ నుండి ఒక ముఖ్య విషయము వినవలసియున్నది. పూర్వము వర్ణవ్యవస్థ ఏర్పడిన తరువాత కొంతకాలమునకు బ్రహ్మసభలో తమగోత్రాధిక్యత వలన సన్మానింపబడిన వైశ్యులు కర్మభూమియైన మర్త్యలోకమునకు చేరి బహుకాలము సర్వసుఖములతో జీవించిరని మీచే చెప్పబడినది. వారు భూలోకమున ఏవిధముగ ప్రవర్తించిరి? నాటి ఆ వైశ్యులలో కొంతమంది అమోఘమైన తపస్సుచేసి కైలాసవాసమును వరము పొందిరని వింటిమి. ఆ వృత్తాంతమును వాత్సల్యముతో మాకు దెలియజేయుడు" అని ప్రార్థించిరి. అపుడా సాలంకాయన మహర్షి యీ విధముగ చెప్పెను.

### వైశ్యఋషుల విరక్తి – అపరార్కుని ఉపదేశము :-

సప్తమమైన వైవస్వత మన్వంతరములోని కాలమున కొన్ని మహాయుగములు గడిచినవి. కాల ప్రభావము వలన క్రమక్రమముగ ప్రపంచములో దుష్టత్వము

పెరుగసాగినది. అధిక సంఖ్యాకులైన మానవులు ఇంద్రియలోలురై ధర్మమును పోనాడి, అధర్మవర్తనులైరి. వారిలో దైవీయ గుణములంతరించి, అసురీయగుణములు అధికమైనవి. అట్టితరి ఆ అపరార్కుని ఆశ్రమమునకు చేరి వారిని పూజించి "మహాత్మా! క్రోధ సంభవులను కపటులును, పరధనాపహారులును, పరస్త్రీలోలురును మద్యపానామత్తులునునైన నరాధములు యిపుడీలోకములో పెరుగసాగిరి. ఈ లోకము సకల దుఃఖములకు ఆశ్రయమై, దురాశకు స్వార్థమునకు హింసకు అశాంతికి నిలయమై దుస్సహమైన నరకతుల్యముగ మారుచున్నది. ఇట్టి యీ లోకమున మేము వుండజాలము. సత్యజ్ఞానదృష్టిగల సుకృతులు, తపస్సంపన్నులును, నిష్కామకర్మయోగులును, దోషరహితులును, సత్యసంధులును, శాంతిప్రియులును అహింసావ్రతులును, మహాత్ములును నైన పుణ్యశీలురు ఏలోకంలో నుందురో, మహాయజ్ఞములను చేసిన ఆత్మ దేహములను త్యాగము చేసినవారు నైన పుణ్యాత్ములు సంసార సముద్రమును దాటి ఆదివ్యాధిరహితులై ఏ స్థానములో అలరారుచుందురో, అట్టి తగిన ఉపాయమును మాకు ఉపదేశింపుడు" అని ఆ గురుదేవుని చరణములపైబడి వేడుకొనిరి.

అపుడు వైశ్యగురుడైన అపరార్కుడు తన శిష్యుల భక్తిజ్ఞానవైరాగ్యములకు మిక్కిలి సంతోషించిన వాడై వారితో "ఓ బిడ్డలారా! పూర్వము భూమిని రథముగను, ఆదిశేషుని అల్లెత్రాడుగను, మేరుగిరిని ధనస్సుగను, సూర్యుని చక్రముగను, శ్రీమన్నారాయణుని బాణముగను చేసుకొని త్రిపురాసుర సంహారమొనర్చి లోకములను రక్షించిన మహేశ్వరుని గూర్చి మీరు ఏకాగ్ర చిత్తులై తపస్సు చేయుడు. కామక్రోధాదులైన అరిషడ్వర్గములను జయించి, ఇంద్రియములను నిగ్రహించి నిశ్చలబుద్ధులై, శీతోష్ణములను సుఖదుఃఖములను శత్రుమిత్రత్వములను సమానములుగ భావించి అహింసావ్రతులై, సత్యనిష్ఠులై సర్వశుభంకరుడైన శంకరుని ఆరాధింపుడు. అటుపై

భూమియందు మీ వంశమును నిలిపి దేవఋషి పితరుల యొక్క ఋణములను దీర్చి, ఇష్టవస్తు పరిత్యాగము గావింపుడు. కఠిన దీక్షలను వహించి, పరమేశ్వరుని గూర్చి తపమాచరింపుడు. శివసాక్షాత్కారము నొంది కైలాసవాసులుకండు" అని బోధించి వారికి ప్రణవపూర్వక శివపంచాక్షరీ మంత్రమునుపదేశించెను.

## వైశ్యమునుల ఘోరతపస్సు - కైలాసవాస వరప్రాప్తి :-

గురువచనానుసారము ఆర్యవైశ్య పుంగవులు తమ పుత్రపౌత్రులను గృహములయందు నిలిపి, తీర్థయాత్రలను మిషతో తపస్సుకొరకై అడవులకు వెడలిపోయిరి. అనంతరము పవిత్ర హిమాలయ పర్వతశిఖరభాగమైన బ్రహ్మ మానస సరోవరతీరభూమికి చేరిరి. వారచట నిశ్చల భక్తితో శివలింగములను స్థాపించి విభూతిరుద్రాక్షలను ధరించి విధ్యుక్తప్రకారము శివుని పూజించిరి. అటుపై మొదట ఇష్టవస్తువులను పరిత్యజించి, క్రమముగ ఆహారపానీయాదులను విడచిపెట్టిరి. వాయువును ఆహారముగ చేసుకొని కొంతకాలము, సూర్యకాంతినే ఆహారముగగొని, మరికొంతకాలము వెన్నెలను ఆహారముగ బడసి ఇంక కొంతకాలము, నిరాహారులై మరికొంతకాలము జితేంద్రియులై పంచాగ్ని మధ్యమున ఒంటికాలిపై నిలిచి అచంచల దీక్షాదక్షులై పంచాక్షరీ జపయోగ తత్పరులై ప్రచండమైన తపస్సు గావించిరి. దేవతలకు గూడ చేయశక్యముగాని వైశ్యుల భీషణతపస్సుచే ముల్లోకములు కంపించినవి. తుదకు భూతేశుడైన ఆ మహేశుడు సతీసమేతుడై వెండికొండనుండి కదలివచ్చి వారికి దర్శనమిచ్చెను. ఆ పరమేశ్వరుని దివ్యదర్శన భాగ్యముచే వైశ్యులు అమితానంద పరవశులై ఆ దేవదేవుని అనేక విధముల నిట్లు సంస్తుతించిరి.

"ఓ దేవదేవా! నీకు నమస్కారము. దేవాధ్యక్షా! నీకు నమస్కారము. కరుణారస సముద్రా! నీకు నమస్కారము. విశ్వేశ్వరా! నీకు నమస్కారము. త్రిలోచనా! నీకు

నమస్కారము. అణుస్వరూపుడవును స్వతంత్రుడవును. ఆత్మాధిష్టితుడవునైన నీకు నమస్కారము. సర్వాధికుడవు, సూక్ష్ముడవు. పరిపూర్ణుడవు నీకు నమస్కారము. మృత్యువును జయించినవాడవును, రుద్రుడవును, నీలకంఠుడవునునైన నీకు నమస్కారము. మహేశ్వరుడవు. భవుడవునగు నీకు నమస్కారము. పినాకమను విల్లును ధరించినవాడవును, త్రిపుర సంహారకుడవునునైన నీకు నమస్కారము. అర్ధచంద్రుడు కిరీటమున గలవాడవును, వామదేవుడవును నైన నీకు నమస్కారము. సర్పభూషణుడవును, పరిశుద్ధస్ఫటిక సదృశ దేహుడవును, అంతర్బహిర్జగత్తు నందంతటను వ్యాపించి యుండు వాడవునునైన నీకు నమస్కారము. నిర్గుణడవు, సగుణుడవు, శాంతుడవు, నిత్యుడవు, వికల్పరహితుడవు, విరాగివి, మహాత్ముడవు, మంగళస్వరూపుడవునైన నీకు నమస్కారము. మదనాంతకుడవును, కైలాసాచలమున శయనించినవాడవును, మహావిష్ణువునే బాణముగా గలవాడవును, మేరుపర్వతమునే ధనస్సుగా జేసుకొన్నవాడవును, గజచర్మాంబరధారియైన వాడవును, కరుణారస సముద్రుడవునునైన ఓ దేవా! నీకు పునఃపునః ప్రమాణములు.

ఓ లోకైకనాయకా! అగాధమైన యీ సంసారసాగరమున మునుగుచుండు, మేము మాసుకృత విశేషముచే మీ పదకమలద్వయమున మనోహరమైన దీపములవలే దర్శించుచున్నాము. అని యిట్లు ప్రార్థించిన వైశ్యులయెడ ఈశ్వరుడు ప్రసన్నుడై వారిని ఇష్టమైన వరమును కోరుకొనుడనెను. అంతట ఆ వైశ్యులు శివునితో "ఓ పరమశివా! నిరంతరము మీ సేవాభాగ్యమును మేము పొందగలగునట్లు నీకైలాసమున మాకు నివాసమును కలిగించు వరమును ప్రసాదింపుము." అని ప్రార్థించిరి. శివుడు సంతోషించి వారు కోరిన ప్రకారమే సమస్త సుఖసంపదలకాలవాలమై వెలుగొందు కైలాస పర్వతభాగమైన 'మహాగిరి' అను ప్రదేశమును ఆ వైశ్యుల నివాసమునకై యేర్పరచి అంతర్ధానుడయ్యెను. అపుడా వైశ్యులు దివ్య విమానములలో మహాగిరి జేరి

పరమానందభరితులై అట నివసింపసాగిరి. కైలాసవాసులైన ఆసిద్ధవైశ్యులు ప్రమథగణములతో జేరి శివసాన్నిధ్యమున వసింపసాగిరి. పూర్వము పరాంబికచే సభాంధవ మోక్షమును వరముగానందిన సమాధి అను వైశ్యోత్తముడు కైలాసమున సోమదత్తుడను పేరజన్మించి అచటి సిద్ధవైశ్యులకు అధిపతియయ్యెను.

## కీర్తి కన్యావృత్తాంతము :-

ఆ సోమదత్తునకు చాలాకాలమువరకును సంతానము కలుగలేదు. అతడు దేవర్షియైన నారదుని ఉపదేశానుసారము సంతాన ప్రాప్తికై దేవీ మహాయజ్ఞమును ఆచరించెను. సోమదత్తుని భక్తికి సంతోషించిన పరాంబిక వానికి పుత్రికగా ప్రభవించెను. ఆ బాలిక కులమంతటికిని కీర్తిగూర్చ గలదనియు, ఆ బాలిక ద్వారా వైశ్యసముదాయమునకు దుర్లభమైన మోక్షము కలుగగలదనియు, ఆ బిడ్డ జననకాలమున ఆకాశవాణి పలికినది. ఆ పలుకుల ననుసరించి సోమదత్తుడు తన కుమార్తెకు కీర్తికన్య యని నామకరణము గావించెను.

ఆ కీర్తికన్యదినదిన ప్రవర్ధమానయగుచు సకల కళలలో ఆరితేరి యౌవనవతియైనది. త్రిజగన్మోహనమైన ఆమె సౌందర్యమూ, ఆదర్శప్రాయమై ఆమె సౌశీల్యమూ, అనుపమానములైన ఆమె భక్తి జ్ఞానవైరాగ్యములు మునులకు, దేవతలకును కూడ అబ్బురపాటు గల్గించసాగినవి.

ఒకనాడా కీర్తి కన్యక సర్వాంలకార భూషితయై చెలులతో గూడి, మహాగిరిలోని ఉద్యానవనమందు విహరించసాగినది. ఆ సమయమున చిత్రకంఠుడను గంధర్వరాజొకడు చంద్రశేఖరుని దర్శనార్థమై పోవుచు వనవిహార మొనర్చుచున్న కీర్తికన్యను చూచెను. కన్యాకృతిలో సంచరించుచున్న విద్యుల్లతవలె మెరసిపోవు ఆ కాంతామణిని తిలకించిన చిత్రకంఠుడు, మన్మథబాణ విదారిత హృదయుడై ఆమెను



గంధర్వుడు కీర్తికన్యను మోహించుట

సమీపించి "ఓ మంగళాంగీ! నీవెవ్వరవు? ఎక్కడిదానవు? ఎవ్వరి పుత్రికవు? నీపేరేమి?" అని ప్రశ్నించెను. అంతట ఆమె చెలులలో నొకర్తె ఆ కన్య యొక్క వృత్తాంతమును వానికి తెలియజెప్పెను. కీర్తికన్య అవివాహితయని తెలుసుకొనిన చిత్రకంఠుడు, మోహాంధుడై ఆమెను వివాహమాడ వాంఛించి తన కోర్కెను వెల్లడించెను. అంతట కీర్తికన్య వానితో "ఓ గంధర్వరాజా! నేను నిరంతర పరమాంబికా పదధ్యాన నిమగ్నురాలను. ఐహిక సుఖాసక్తిలేని దానను. ఆమరణ బ్రహ్మచారిణిగ నుండ నిశ్చయించుకున్నదానను. కనుక మీరిట్టి మాటలు కట్టిపెట్టుడు" అని పలికి యిక అట నిలువక తన గృహమునకు వెడలిపోయెను.

కామాంధుడై వివేకము కోల్పోయిన గంధర్వరాజు వైశ్యుల నివాసమునకు పోయి అట వైశ్య ఋషి సంఘమును జూచి కీర్తికన్యను తనకిచ్చి పెండ్లిచేయుడని మరిమరి


వైశ్యఋషులు చిత్రకంఠుడుని శపించుట

ప్రార్థించగా, ఆ వైశ్యులాతని అనుచితమైన సంభాషణము నిరసించుచు వాని కోర్కెను నిరాకరించిరి. అంతట గంధర్వరాజు కోపోద్రిక్తుడై మండిపడుచు వైశ్యులను చూచి "ఓ దుష్టులారా! అనంతశక్తి సంపన్నుడనైన నన్ను యీసడించిన యీకన్యయు, ఆమె బంధువులైన మీరందరును భువిలో జన్మించి భయంకరమైన అగ్నిలోపడి భస్మమయ్యెదరు గాక" అని ఘోరముగా శపించెను. తమను నిష్కారణముగ శపించిన ఆ నీచగంధర్వుని చూచి వైశ్యులు కోపోద్రిక్తులై "ఓ మూర్ఖుడా! నిరపరాధులమైన మమ్ములను శపించిన నీవును సర్వభ్రష్టుడవై మనుష్యలోకులో జన్మించి పిడుగువంటి వార్తవిని శిరము వేయివ్రయ్యలై ప్రేలిపడగా ఘోరమరణము పొందెదవుగాక" అని ప్రతి శాపమిచ్చిరి. దానితో మణిపురాధిపతియైన ఆ గంధర్వునకును, కైలాసవాసులైన వైశ్యులకును నాటినుండి వైరము ప్రారంభమైనది. కాలం గడువసాగినది. ఒకనాడు

వైశ్యులు మందాకినీ నదిలో స్నానము చేయుచుండగా చిత్రకంఠుడు వారిపై గంధర్వమాయను ప్రయోగించెను. ఆ మాయా ప్రభావము చేత వైశ్యులు నదీజలముల నుండి బయల్పడలేక భీతావాహులై పరాంబికను మనసారా ధ్యానించి శరణువేడిరి. వెంటనే ఆ పరమేశ్వరీ అనుగ్రహముతో రెండు దివ్యనౌకలు వారి సమీపమునకు వచ్చినవి. వైశ్యులు ఆ ఓడలపైనెక్కి శీఘ్రముగ దరిజేరి ప్రాణములు దక్కించుకొనిరి. దుష్టచిత్రకంఠుని దుశ్చర్యలను చూచికోపించిన పరాంబిక ఆ గంధర్వ రాజును తనకంటి మంటలచేత దహించివేసెను.

అటుపై తన భక్తులైన వైశ్యులను చూసి "ఓ వైశ్యోత్తములారా! భండాసురాంశచే జన్మించిన యీ గంధర్వరాజు భావికాలమున మరొక జన్మముపొంది మిమ్ములను పీడింపసమకట్టగలడు. కనుక సావధానులై యుండుడు." అని హెచ్చరించి అదృశ్యురాలైనది. అంతట ఆ వైశ్యులు నిజనివాసమునకు చేరి సుఖముగనుండిరి.

వారు ఆదిపరాశక్తిని ఆరాధించుచు నిరంతరము కైలాసపతిని సేవించుచు అలకాధిపతియగు కుబేరుని అండదండలతో తమ నివాసమైన మహాగిరిని అనంతైశ్వర్యవంతముగ తీర్చిదిద్దుచు కాలము గడుపసాగిరి. ఇట్లు యుగములు గడచినవి.

మహత్తరమైన యీ కీర్తికన్యా ఉదంతమును విన్నవారును చదివిన వారును పరాంబికాకృపకు పాత్రులై, విధివశమున కలుగు ఆపదలనుండి గూడ బయల్పడగలరని సాలంకాయన ఋషి మణిగుప్తాదులకు తెలియజేసెను.

సాలంకాయనునిచే కీర్తికన్యోదంతము విన్న మణిగుప్తాది వైశ్యోత్తములు గురువుతో "ఓ మునిసత్తమా! కైలాసమున నివసించుచుండిన వైశ్యఋషులు

భూలోకమున కెప్పుడే కారణము వలన చేరిరి? ఆ వృత్తాంత మంతయును దయతో తెలియజేయుడు" అని ప్రార్థించిరి. అంత సాలంకాయనుడు పూర్వము వ్యాసశిష్యుడైన సూతమహాముని శౌనకాది మహర్షులకు జెప్పిన విధమున నేనా మహత్తర వృత్తాంతమును మీకిప్పుడు చెప్పెదనని యిట్లు చెప్పసాగెను.

## దక్షయజ్ఞము - దాక్షయణీ దేహత్యాగము :-

ఓ మణిగుప్తాదులారా! సతీదేవి తండ్రియగు దక్షుడు ప్రజాపతియై బ్రహ్మాధిపత్యమును పొందుటవలన గర్వితుడై వాజపేయమను యజ్ఞము చేయ సంకల్పించి సకల దేవతలను ఆహ్వానించెను గాని తన అల్లుడైన శివుని మాత్రము ఆహ్వానించలేదు. బ్రహ్మాది దేవతలందరు ఆ యజ్ఞమునకు తరలి వెళ్లుటను చూచిన దాక్షాయణి శివునితో కూడి యజ్ఞమునకు వెళ్ళవలెనని వాంఛించినది. శంకరుడు అనాహ్వానితుడగుట వలనను, దక్షుని అహంకారమునకు కోపించిన వాడగుట వలనను సతీదేవి యొక్క కోర్కెను నిరాకరించెను. ఆమె మాత్రము తన పుట్టింటికి వెళ్ళియే తీరవలెనని పట్టుబట్టినందువలన ఈశ్వరుడు ఆమెను ఆటంకపరచలేదు. దాక్షాయణి ఆ యజ్ఞమునకు వెళ్ళినది. కాని ఆమె తల్లిదండ్రులు ఆమెను నిరాదరించుటయే గాక శివుని గూర్చి హేళనగ మాట్లాడి అవమానించిరి. దధీచి మహర్షి రుద్రునకు హవిర్భాగము యివ్వబడలేదు. తండ్రిచే ఇట్లవమానింపబడిన సతీదేవి రోషపూరితయై తన దేహము నుండి యోగాగ్నిని పుట్టించుకొని దగ్ధమైపోయినది. అంతట రుద్రుడు ప్రళయకాలరుద్రుడై తన జట నుండి వీరభద్రుని ప్రభవింపజేసెను. వీరభద్రుడు దక్షయజ్ఞమును ధ్వంసము గావించెను. అటుపై శంకరుడు సతీవియోగము వల్ల భ్రాంతుడై తిరుగుచు హిమాలయమునకు జేరి ధ్యానమగ్నుడై ప్రపంచమును మరిచి కాలము గడుపసాగెను. శివశక్తి స్వరూపిణియైన సతీదేవి లేకపోవుట వలన సమస్త

చరాచర విశ్వము సౌభాగ్యహీనమైపోయినది. అందరి హృదయకోశములందును ఆనందరసము యింకిపోయినది. శక్తిహీనమైన విశ్వములో గ్రహగతులు విపరీతములైపోయినవి.

## తారకాసుర వృత్తాంతము :-

ఆ సమయమునందే తారకుడను మహారాక్షసుడు బ్రహ్మచే అమోఘ వరములను పొంది త్రిలోకములను జయించెను. వాని దురాగతములకు గురియై భూలోకము తల్లడిల్లినది. ద్విజులైన వైశ్య క్షత్రియ, బ్రాహ్మణులు ఆ మహారాక్షసునకు భయపడి పలుదిక్కులు పారిపోయిరి. వ్యవసాయ వ్యాపారాదులు అడుగంటినవి. యజ్ఞయాగాదులు మృగ్యమైపోయినవి. వైదిక ధర్మాచరణము అదృశ్యమైపోయినది. ఎక్కడ చూచినను దారిద్ర్యము తాండవించ సాగినది.

శివునకు జన్మించిన కుమారుని చేత మాత్రమే తాను చంపబడునట్లు బ్రహ్మచే వరమందిన తారకాసురుడు ఆ శివునకు కన్నకొడుకు లేకుండుట వల్ల తనకు మృత్యువే రాదని భావించి మిడిసిపడసాగెను. సతీ వియోగములోనున్న శివునకు పుత్రుడు పుట్టుట యెట్లని దేవతలందరు విచారగ్రస్తులైరి. వారు వైకుంఠవాసుని శరణుజొచ్చిరి. అపుడు విష్ణువు సకలదేవతాసమేతుడై హిమగిరి కరుదెంచి పరాశక్తిని సంప్రీతురాలుగ చేయుటకై బహువిధముల దేవీ యజ్ఞములను ఆచరింపజేసెను.

## దేవతలకు పరాశక్తి సాక్షాత్కారము :-

ఇట్లుండ అకస్మాత్తుగ చైత్రశుక్ల నవమీ శుక్రవారమునాడు శృతిబోధిత యైన పరాశక్తి తేజస్సు దేవతలయెదుట ఆవిర్భవించినది. కోటి రవిచంద్రుల ప్రకాశముతో కోటి మెరుపు తీగెల కాంతితో వెలుగు ఆ మహాతేజస్సు సుందరాతి సుందరమైన రూపమును

ధరించినది. పాశాంకుశ వరదాభయహస్త ముద్రలను దాల్చిన చతుర్భుజియై దేవతల యెదుట నిలచినది. దేవతలు ఆ జగన్మాతను అనేక విధముల కీర్తించిరి. తారకాసురుని వలన తమకు కలుగుచున్న బాధలను గూర్చి ఆ తల్లికి విన్నవించి తరుణోపాయమును ప్రసాదింపుమని ప్రార్థించిరి.

అంతట ఆ దేవి ప్రసన్నురాలై దేవతలను జూచి "ఓ అమరులారా! దక్షాధ్వర సమయమున దేహత్యాగము చేసిన నా అవతార రూపిణియైన దాక్షాయణి, నా భక్తుడైన హిమవంతునకు పుత్రికయై, పార్వతిగ జన్మించగలదు. ఆమెను శంకరునకిచ్చి వివాహము గావించుడు. ఆ గౌరి తన పుత్రునిచే తారకాసుర సంహారరూపకమైన మీ కార్యమును నెరవేర్చగలదు." అని చెప్పి అదృశ్యురాలైనది.

దేవీ ప్రభావము వలన హిమవంతుని భార్యయైన మేనక గర్భము ధరించి ఒక శుభముహూర్తమున పుత్రికను ప్రసవించినది. దేవీ జన్మదినమున సమస్త దేవతల మంగళవాయిద్యములు మ్రోగినవి. అంతటను పుష్పవర్షములు కురిసినవి. పర్వతేశ్వరుని పుత్రిక గనుక ఆ బిడ్డ పార్వతి అను నామమును ధరించినది. దినదినాభివృద్ధి నొంది ఆ బాల నవయౌననవతియైనది. హిమాలయమున యోగనిష్టతోనున్న ఈశ్వరునకు సేవలు చేయుటకై హిమవంతుడు పార్వతిని నియోగించెను. ఆమె అత్యంత భక్తి శ్రద్ధలతో శివునకు పరిచర్యలు చేయుచుండెను.

## కందర్ప దర్ప భంజనము :-

ఆ సమయమున కైలాస శిఖరముపై నిర్వికారుడై సమాధినిష్టుడైయుండిన శివునకు పార్వతీదేవి యందు మోహము పుట్టించుటకై దేవతలు మన్మథుని నియోగించిరి. స్వర్గరాజ్యమును నిలుపుటకును, దేవకార్యమును నిర్వహించుటకును సన్నద్ధుడైన మదనుడు ఇక్షుచాపమును, పుష్పశరములను చేబూని చిలుకవాహనమెక్కి

మీనకేతనుడై శుకపికశారికాదుల మధురమంజుల గానముచే సేవింపబడుచు, స్నేహితుడైన వసంతునితో గూడి శివసమీపమునకు చేరుకొనెను. అతడు మేరుచాపుడగు ఈశ్వరుని వక్షస్థలముపై నల్లకలువ మొగ్గయను తీక్షణ బాణమును ప్రయోగించగ, ఆ పుష్పబాణము మధుర మకరందమును వెదజల్లుచు అతివేగముతో వచ్చి శివుని హృదయమున నాటుకొన్నది. శంకరుని సమాధిస్థితి చెదరిపోయినది. దానితో భీషణరోషయుక్తుడైన ముక్కంటి తన అగ్నినేత్రమును తెరచి, మన్మథుని భస్మీపటలుని గావించెను. ఆ భయంకర దృశ్యమును చూచిన మన్మథుని సతియైన రతీదేవి శంకరుని చరణములపైబడి పతిభిక్షపెట్టమని విలపించినది. వెంటనే త్రిలోకములలో గల సమస్త దేవజాతుల వారు ఈశ్వరునితో "ఓ దేవదేవా! మన్మథుడులేని విశ్వము రసహీనమై సృష్టి వికాసమే అంతరించి పోగలదు. జగత్ప్రభుడైన నీవు మదనుని బ్రతికించి జగత్తులను రక్షింపుము." అని వేడుకొనిరి. కరుణాసముద్రుడైన శంకరుడు రతీదేవిపై దయవహించి ఇకపై మన్మథుడు అనంగుడై సర్వలోకములలోను సంచరించగలడనియు, అతడు రతీదేవికి మాత్రమే సశరీరుడై కనిపించగలడనియు వరమిచ్చి అందరినీ సంతోషపరచెను.

అటుపై శివుడు అటనుండి కైలాసగిరికి వెడలిపోయెను. పార్వతి శివునితోగల తనపూర్వ సంబంధము నెరిగినదై ఈశ్వరునే పతిగా తలచుచు అతితీవ్రమైన తపస్సు చేయనారంభించెను.

అనంతరము ఒకనాడు నారదుడు విష్ణుదేవుని ప్రేరణతో శివుని చెంతకేగి పార్వతీగుణరూప విలాసములను గూర్చి మిక్కిలి అభివర్ణించి చెప్పెను. అంతకు ముందే మదనుని పుష్పబాణ ప్రభావముతో మరులుగొన్న శివుని హృదయమున పార్వతిపై మక్కువ ఎక్కువైనది.

తదనంతరము వాణీపతియైన బ్రహ్మ శ్రీ శంకరుని యొద్దకు వచ్చి దక్షధ్వర సమయమున దగ్ధమైన శివసతియే పార్వతిగా ప్రభవించినదన్న విషయము దెలిపి, ఈశ్వరుని ప్రేమను యినుమడింపజేసెను.

## పార్వతీ కళ్యాణము :-

జరిగిన విషయములను నారదుని వలన వినిన మహావిష్ణువు శివసన్నిధికేగి వారి అభీష్టమును అనుసరించి వివాహకార్యనిర్వహణ భారమును వహించెను. అదనుజూచి విష్ణువు సప్తఋషులను హిమవంతుని యొద్దకు పంపెను. వారు ఆ పర్వతరాజునకు పార్వతీపరమేశ్వరుల గత వృత్తాంతము లన్నింటిని విశదపరచి, వానిని అంగీకరింపజేసిరి. శివపార్వతుల కళ్యాణము నిశ్చయించబడినది. సమస్త లోకములలోని దేవతలందరకు ఆహ్వానము లందించబడినవి. అపూర్వవైభవముతో లోక ప్రసిద్ధమైన పార్వతి పరమేశ్వరుల వివాహ మహోత్సవము గావించబడినది. లోకేశ్వరుడైన శివుడు శక్తియగు పార్వతి పాణిగ్రహణము చేయుటచే సమస్తలోకములు వినూత్న శోభలనంది విరాజిల్లినది.

పరమపవిత్రమైన యీ పార్వతి కళ్యాణగాధను వినువారును, పఠించువారును పార్వతీపరమేశ్వరుల కృపతో సమస్త సన్మంగళములను బడయగలరు.